



సంక్రాంతి పండగకు స్వస్థలాలకు వస్తున్న వారితో ఖమ్మం కొత్త బస్టాండ్ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కిటకిటలాడింది. ఆతర్వాత కొన్ని ప్రాంతాలకు ప్రయాణికులు తగ్గడంతో అటు వైపు వెళ్లాల్సిన బస్సులను రద్దీ రూట్లకు మళ్లించారు. దీంతో రాత్రి 8గంటలకల్లా బస్టాండ్ ఖాళీ అయింది.

బరువెక్కిన బస్టాండ్లు..!



ఖమ్మం పాత బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిట

- మూడు రోజులుగా తగ్గని రద్దీ
- హైదరాబాద్ రూట్లకు పల్లెవెలుగు బస్సులు
- గ్రామాలకు బస్సులు లేక అవస్థ
- భద్రాచలం, సత్తుపల్లి ప్రాంతాలకు అధిక సర్వీసులు

ఖమ్మంమయూరిసెంటర్: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చే ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయింది. వరుసగా పండగ సెలవులు రావడంతో హైదరాబాద్, ఇతర నగరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్తున్నారు. ఈ నెల 11 నుండే విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో 10వ తేదీ నుండే పల్లెలకు పయణమయ్యారు. దీంతో గత మూడు రోజులుగా వేలాది మంది ప్రయాణికులతో బస్టాండ్‌లు జాతరను తలపిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ గ్రామాలకు వెళ్లేందుకు వచ్చే ప్రయాణికులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి, విశాఖపట్నం, తిరువూరు ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులు ఖమ్మంలోని కొత్త, పాత బస్టాండ్‌లకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దీంతో మూడో రోజు ఆదివారం కూడా ఖమ్మం బస్టాండ్ ప్రాంగణాల్లో ప్రయాణికుల రద్దీ నెలకొంది.

పల్లె ప్రయాణికుల అవస్థ..

ఖమ్మం జిల్లా మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేందుకు సులభంగా ఉంటుందని ప్రయాణికులు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్టాండ్‌లకు చేరుకునేందుకు ఆసక్తి చూపించారు. విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ నుంచి ఖమ్మంకు ఆర్టీసీ బస్సుల ద్వారా బయలుదేరారు. దీంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ఖమ్మం రీజియన్‌లోని పలు పల్లె సర్వీసులను రద్దు చేసి హైదరాబాద్ రూట్లకు పంపారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఖమ్మానికి చేరిన ప్రయాణికులకు వారి సొంత గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల పాటు వేచి ఉన్నా.. బస్సులు రాకపోవడంతో ఆటోలను కిరాయిలకు మాట్లాడుకొని గమ్యస్థానాలకు చేరారు.

హైదరాబాద్ వెళ్లడంతో..

సంక్రాంతి సెలవులు శనివారం నుండే ప్రారంభం కావడం, ఉద్యోగులకు వారంతపు సెలవులు ఉండడంతో శుక్రవారం, శనివారం అత్యధిక మంది ప్రయాణికులు తమ గ్రామాలకు బయలుదేరారు. దీంతో ఆదివారం ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉంటుందని చాలామంది భావించి ఆదివారానికి వాయిదా వేసుకున్నా.. ప్రయాణికుల తాకిడి మాత్రం తగ్గలేదు. వేలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌కు చేరుతుండడంతో వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు తీవ్రంగా శ్రమించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అదనపు బస్సులన్నీ హైదరాబాద్‌కు వెళ్లడంతో స్థానికంగా ఉన్న బస్సులను వినియోగించుకున్నారు. ఎక్కువగా రద్దీ ఉన్న భద్రాచలం, సత్తుపల్లి రూట్లకు అధిక బస్సులు నడిపారు.



కోదాడ బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

సంక్రాంతి ముగ్గుల సందడి



ఖమ్మం మామిళ్లగూడెం: కస్బాబజార్‌లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

- **ఖమ్మం మామిళ్లగూడెం:** సంక్రాంతి పండగను పురస్కరించుకొని మహిళలకు వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యాన ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈనేపథ్యాన నగరంలోని 37వ డివిజన్ బొమ్మిడివారి వీధి కస్బాబజార్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్‌శర్మ ఆధ్వర్యాన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి సంతోష్, గుర్రాల నాగేంద్రరావు పిల్లలమర్రి వెంకట్, రుద్రప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంరూరల్:** మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్, కామంచికల్‌లలో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యాన, గూడురుపాడులో హనుమంతు కృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నాయకులు సిద్ధినేని కర్ణకుమార్, పుచ్చకాయల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంగాంధీచౌక్:** నగరంలోని శ్రీవెంకటేశ్వర కాలనీ రోడ్ నంబర్-3, బురహాన్‌పురంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించి 49వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, దరిపెల్లి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం దరిపల్లి కిరణ్, స్వాతి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ శశిదేవి, క్లబ్ ప్రసిడెంట్ స్వర్ణలత, కార్యదర్శి విజిత, ప్రమీల, జాన్‌బాయ్, తదితరులు పాల్గొన్నారు.

12సీకెఎం261: ఖమ్మంగాంధీచౌక్: విజేతలకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, నిర్వాహకులు

విద్యాలయాల్లో..



ఖమ్మంసహకారనగర్: ముగ్గులు పరిశీలిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యాన జరిగిన పోటీల్లో డైరెక్టర్ శ్రీవిద్య, అకాడమిక్ డైరెక్టర్ బి.సాయి గీతికలు పాల్గొని విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. నగరంలోని శ్రీనారాయణ హైస్కూల్ ఆధ్వర్యాన జరిగిన పోటీలకు కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, 18వ డివిజన్ కార్పొరేటర్ మందడపు లక్ష్మీ పాల్గొని బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ సందీప్‌కుమార్, డైరెక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

రైతులపై మొండి వైఖరి వీడాలి

నేలకొండపల్లి: రైతుల పట్ల ప్రధాని మోదీ మొండి వైఖరి వీడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని అమ్మగూడెం, చెన్నారం గ్రామాల్లో ఆదివారం రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఢిల్లీలో గత 42 రోజుల నుంచి రైతు జగ్జిత్‌సింగ్ దలైవాల్ చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షను విరమించేలా చర్యలు చేపట్టాలని, గతంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేన్నారు. లేనిపక్షంలో రైతాంగం సమస్యలపై సంఘం క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేపడుతుందని పేర్కొన్నారు. సంఘాన్ని బలోపేతం కోసమే ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడపాల రమణ, వాసంశెట్టి నరసయ్య, నాగేశ్వరరావు, జానీ, కె.నాగేశ్వరరావు, రవి, వెంకన్న, వీరందర్, అడపాల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన చోరీలు..!



కోయచలక గ్రామ సమీపంలో కల్లంలో ఆరబెట్టిన మిర్చి

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట రైతు చేతికందినట్లే అంది దొంగలపాలు అవుతున్నాయి. ఇటీవల కాలంలో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తూ రైతులను నిద్రలేకుండా చేస్తున్నారు. క్వింటా మిర్చి రూ.15వేలకుపైగా ధర పలుకుతుండడంతో దొంగలు రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. గత రెండు రోజులు క్రితం కోయచలక గ్రామ సమీపంలో పలువురు రైతులు కలాల్లో మిర్చిని ఆరబెట్టగా.. ముత్తయ్య అనే రైతుకు చెందిన మిర్చిని చోరీ జరిగింది. దీంతో రైతులు అప్రమతంగా ఉండాలని గ్రామంలో ప్రచారం చేస్తున్నారు. - రఘునాథపాలెం

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు



ఎంపీకి కేక్ తినిపిస్తున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: ప్రియాంకగాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళంవిప్పి అధికారపక్షాన్ని ఇరుకున పెడుతున్న గొప్ప నాయకురాలన్నారు. అటు పార్టీకి, రాహుల్‌కు చేదోడుగా ఉంటూ మరిన్ని పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, చంద్రం, పాలకుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

కామేపల్లి: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ అన్నారు. ఆదివారం కామేపల్లి రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్ల పథకం, కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా పథకానికి అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా నిరుపేదలకు ఆర్థికసాయం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మతోన్మాదం పెరిగిపోతోంది'

ఖమ్మంమయూరిసెంటర్: భారతదేశంలో రోజురోజుకు మతోన్మాదం పెరిగిపోతోందని సీపీఐ జిల్లా నాయకుడు మహ్మద్ సలాం అన్నారు. ఆదివారం స్థానిక నరసింహస్వామి గుట్ట వద్ద భోగిమంటలను వేసి మతోన్మాదాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కులం, మతం అనే విభేదాలు సృష్టించి ప్రజల మధ్య వైషమ్యాలు రేపుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇలా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న పాలకుల చీడ భోగిమంటల్లో కాలిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివారెడ్డి, మల్లేష్, వెంకటేశ్వర్లు, దుర్గానాథ్, ఉపేందర్, ఉపేందరమ్మ, శోభ, రాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలి

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని పూర్తిగా అమలుచేయాలని రైతు సంఘం మండల నాయకుడు తుల్లూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎదుళ్లచెరువులో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షలకు పైగా ఉన్న అప్పుల విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. అలాగే రైతు భరోసా విషయంలో కూడా ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు.ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేసి ఆదుకోవాలన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామారావు



రామారావు

కామేపల్లి: భారతీయ జనతా పార్టీ మండలాధ్యక్షుడిగా మరోసారి రామకృష్ణాపురం మాజీ సర్పంచ్ జర్పుల రామారావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు పోలూరి రామచంద్రయ్య ఎన్నికయ్యారు. వీరిని ఆ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి గుండగాని భరత్‌గౌడ్ నియమించగా.. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేస్తామని, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని నూతన ఎన్నికైన వారు పేర్కొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడ ఉదయనగర్‌లో నూతనంగా మంజూరైన రేషన్ షాపును ఆదివారం తహసీల్దార్ లూథర్ విల్సన్ ప్రారంభించారు. గత డిసెంబర్ 2న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించిన సందర్భంగా గ్రామస్తులు రేషన్‌షాపు కోసం విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన రేషన్ షాపు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించగా ఈ దుకాణం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సిద్దిక్, కంపటి వెంకన్న, డీలర్ నందా, రఫీ, నూతన్ ప్రసాద్, సందీప్, జరీనా, జ్యోతి, నాగమణి, ఇస్మాయిల్, శివ, సాధిక్‌పాషా, విజయ్,రామ్మూర్తి, బత్తుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు భోగి



కమాన్‌బజార్‌లో రేగు పండ్లు కొంటున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మొదటి రోజు సోమవారం భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ వేడుకలను జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈనేపథ్యానపాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ భోగి మంటల్లో పాత బట్టలు, వస్తువులను పడేసి పీడలు, అరిష్టాలను తొలగించుకుంటారు. పిల్లలపై భోగి పండ్లు పోసి నూరేళ్లు జీవించాలని ఆశీర్వదించడం ఆనవాయితీగా వస్తుండడంతో ఆదివారం ఇదిగో ఇలా రేగు పండ్లను కొనుగోలు చేశారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లా శ్రీ వైష్ణవ సంక్షేమ సంఘం, శ్రీ వైష్ణవ మహిళా సంక్షేమ సంఘం-2025 క్యాలెండర్ల ఆవిష్కరణ ఆదివారం నగరంలోని ఎస్ఎస్‌పీ రామాలయం(రామగిరి)లో జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కె కోదండ రామాచార్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సంఘ ప్రతిని ధులు రాఘవాచార్యులు, ప్రసాదాచార్యులు, పద్మజ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌బీతో అధిక ఆదాయం



సబ్సిడీపై పీఎస్‌బీ అందిస్తున్న ఏడీఏ, ఏఓ

రఘునాథపాలెం: రైతులు పాస్ఫరస్ సాల్యూబులైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) వాడటం ద్వారా వరి, పెసర పంటలు తక్కువ పెట్టుబడులతో ఆదాయం పెంచుకోవచ్చని ఖమ్మం డివిజన్ వ్యవసాయశాఖ అధికారి కొంగర వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం రఘునాథపాలెం రైతువేదికలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఈ పథకం ద్వారా 225 ఎకరాల్లో పండించే రైతులకు 50 శాతం సబ్సిడీతో పీఎస్‌బీని అందిస్తుండగా.. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద

స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువత చెడువ్యసనాలకు బానిసలు కాకుండా దేశ భవిష్యత్‌కు పునాదులుగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. –సాక్షి నెట్‌వర్క్



కామేపల్లిలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



ఖమ్మం రాపర్తినగర్: సర్దార్‌పటేల్ స్టేడియంలో నివాళులర్పిస్తున్న డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి



కూసుమంచి: యువత మేలుకో ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన పాలేరులో రక్తదానం చేస్తున్న యువకులు



నేలకొండపల్లిలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



ఖమ్మంరూరల్: దేర్ ఇంజనీరింగ్ కళాశాలలో..

మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా కేంద్రంలో వచ్చే నెల 2న జరిగే తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ మెంతన సంజీవరావు కోరారు. ఆదివారం ఖమ్మం పీజీ కళాశాలలో దీనికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామిక తెలంగాణ సాధించడం, ప్రజల తక్షణావసరంగా భావించి ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, బుద్ధిజీవులు ముందుకు రావాలన్నారు. తెలంగాణను ప్రజాస్వామిక తెలంగాణగా నిర్మించుకోవడానికి మరోదఫా ఉద్యమించక తప్పదన్నారు. దురుశోజు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు, తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, బహుజన కమ్యూనిస్టు నాయకులు రాంబాబు, విశ్వ సమాజం వ్యవస్థాపకులు జంపాల విశ్వ, బెజ్జంకి ప్రభాకర్, రమేష్, రామటెంకి అశోక్, కోయిని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రఘునాథపాలెం: పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేసి ఆకుటుంబాల్లో సంక్రాంతి సంబరాలు నింపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు గాదె లక్ష్మీనారాయణ, తోటా రామాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చింతగుర్తిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ 2025 క్యాలెండర్లను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు బానోత్ మంగీలాల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు గుగులోతు రాందాస్, మండల కార్యదర్శి రాజగోపాల్, మండల ఉపాధ్యక్షుడు పెనుగూరి సీతారాములు, పంచాయతీ సిబ్బంది వీరయ్య, పెండ్యాల సీతారామయ్య, కౌసల్య, శేఖర్, నెహ్రూ, రాము, ఉపేందర్, సైదులు, వెంకటేష్, రంజాన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నాటి స్మృతులను జ్ఞప్తి చేసుకుంటూ..



కూసుమంచి: సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కూసుమంచి: మండలంలోని మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి (2003–04 బ్యాచ్) విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకుని వారి ఆశీస్సులు పొందారు.

రెబ్బవరం పాఠశాల పూర్వ విద్యార్థులు..

ఖమ్మంఅర్బన్: నగరంలో ఆదివారం వైరా మండలం రెబ్బవరం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి(1988–89వ బ్యాచ్) విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, వ్యాపార, వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకే వేదిక పైకి చేరి ఆనందంగా గడిపారు. అనంతరం నాటి గురువు బండారుపల్లి వెంకయ్యకు సన్మానించారు. పూర్వ విద్యార్థులు బండారు జ్యోతి, దోసపాటి బుజ్జి, డి.రాణి, స్వరూపరాణి, పల్లపోతుల రవికుమార్, కేసా వెంకటగురునాథం, ఎస్‌కె.ఇబ్రహీం, తూము అజయకుమార్, బాలబోయిన నరసింహారావు, పంగా కొండల్‌రావు పాల్గొన్నారు.



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అటెన్షన్ ప్లీజ్

అంత్యక్రియలకు అవస్థలు..!



కూలిపోయిన వైకుంఠధామం ద్వారం



కుప్పకూలిన గదులు

శ్మశానవాటికలు లేకుండా ఇబ్బంది పడొద్దని గత ప్రభుత్వం వైకుంఠధామాలను నిర్మించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మండలంలోని పైనంపల్లి గ్రామంలో గత నాలుగేళ్ల క్రితం ఏటి ఒడ్డున నిర్మించిన వైకుంఠధామం.. ఇటీవల వచ్చిన వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో లక్షల రూపాయలు వరదపాలయ్యాయి. ఈక్రమంలో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇక వర్షాలు, వరదలు సమయాన శవంతో జాగారం చేయాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. - నేలకొండపల్లి